సాక్షి
అనంతపురం

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.




రేపటి 'పోలీస్ స్పందన' రద్దు

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ నెల 17న నిర్వహించాల్సిన 'స్పందన' రద్దు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.4°/23.7°

జిల్లా అంతటా శనివారం పగలు. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సూర్యప్రతాపంతో ఎండలు మండిపోతున్నాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

ఎస్కేయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్ విడుదల



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవ నోటిఫికేషన్ విడుదలైంది. వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు 2022లో పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతకుముందు పూర్తి చేసిన వారు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో మే 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. అయితే దరఖాస్తులు ఆన్‌లైన్ విధానంలో గురువారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్ తెలిపారు. గురువారం నుంచి (ఏప్రిల్ 20) www.skuniversity.ac.in లేదా https;//skuonline.in లో సంప్రదించవచ్చు.

టమాట కిలో రూ.7



అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టం రూ.2.50, సరాసరి రూ.4.50 పలికింది. మార్కెట్‌కు 28 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

రేపు 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: సీఎం పర్యటన విధుల్లో అధికారులు నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించాల్సిన 'స్పందన'ను రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. 'స్పందన' రద్దు చేసిన అంశాన్ని గ్రామ రెవెన్యూ సహాయకులు తమ పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్, గుత్తి పాఠశాల ప్రిన్సిపాల్ బీఈ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం, నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు https://aprs. apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

రేపు జిల్లాకు సీఎం జగన్

- 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమానికి హాజరు కానున్న సీఎం
- శింగనమల నియోజకవర్గం నార్పలలో భారీ సభ
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికార యంత్రాంగం







సిద్ధమవుతున్న సీఎం సభా వేదిక, ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఆలూరు సాంబశివారెడ్డి, కలెక్టర్ గౌతమి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లా రెండుగా విడిపోయాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తొలిసారి జిల్లా పర్యటనకు వస్తున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో 'జగనన్న వసతి దీవెన' సభకు హాజరు కానున్నారు. జిల్లా అధికారులతో పాటు నాయకులు కూడా ముఖ్యమంత్రి సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

ఐదోసారి జిల్లాకు వస్తున్న సీఎం జగన్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఐదోసారి వస్తున్నారు. తొలిసారిగా అనంతపురం జిల్లా కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఆ తర్వాత ధర్మవరంలో నేతన్న హస్తం, వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా రైతుదినోత్సవం పేరుతో రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించారు. అక్కడే ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ప్రారంభించారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పుడు శింగనమల నియోజకవర్గం నార్పలలో జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి వస్తున్నారు. ఇక్కడి నుంచే కంప్యూటర్ బటన్ నొక్కి వసతి దీవెన నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో వేయనున్నారు.

నాలుగు రోజులుగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లలో అధికారులు నాలుగు రోజులుగా తలమునకలై ఉన్నారు. శనివారం ఉదయం కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు, వివిధ విభాగాల అధికారులు అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భారీగా జనం హాజరయ్యే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలిలో ఎక్కువ మంది కూర్చునేందుకు వీలుగా భారీ స్థాయిలో టెంట్లు వేశారు. నార్పల ప్రభుత్వ హైస్కూలులో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సభా స్థలికి ఒకటిన్నర కిలోమీటర్ దూరం పైనే ఉంటుంది. హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి జగన్ బస్సులో ప్రజలకు అభివాదం చేస్తూ సభాస్థలికి రానున్నారు.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి జగన్ సభను స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరవనున్న నేపథ్యంలో వారికి ఎక్కడా ఇబ్బందులు రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక ఎక్కడ ముఖ్యమంత్రి సభ జరిగినా ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా సభాస్థలి ఎంపిక నుంచి రూట్ మ్యాప్ వరకూ అన్నీ రఘురాం పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి సభకు ఎక్కువ మంది మహిళలు హాజరవనున్న నేపథ్యంలో వాళ్లందరూ కూర్చునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా భారీగా టెంట్లు వేశారు. సభకు హాజరయ్యే జనానికి భోజనం, నీళ్ల ప్యాకెట్లు అందించనున్నట్లు ఆలూరి సాంబశివారెడ్డి చెప్పారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లాకు వస్తుండటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కన్పిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవల జరిగిన నారాలోకేష్ పాదయాత్ర జనం లేక వెలవెలబోయిన విషయం తెలిసిందే. ఇక నారా లోకేష్ విమర్శలను తిప్పికొట్టే స్థాయిలో సభకు హాజరు కావాలని శ్రేణులు ఉన్నాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివ్వెరపోయేలా ముఖ్యమంత్రి సభను దిగ్విజయం చేయాలని కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో జిల్లాలో పార్టీ శ్రేణుల్లో సీఎం పర్యటన కొత్త ఉత్సాహం నింపుతుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు.



సభా స్థలి వద్ద డాగ్ స్క్వాడ్ తనిఖీ



హెలిప్యాడ్ వద్ద ట్రయల్ రన్ చేస్తున్న హెలికాప్టర్

ట్రాఫిక్ మళ్లింపు

- వాహనదారులు, ప్రజలు సహకరించాలి
- పార్కింగ్ స్థలాల్లో వాహనాలు ఆపుకోవాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : సీఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 17న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నార్పలలో పర్యటించనున్నారు. నార్పల మీదుగా వెళ్లే భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలలో మళ్లించామని తెలిపారు. తాడిపత్రి నుంచి వయా నార్పల, బత్తలపల్లి మీదుగా కదిరి లేదా ధర్మవరం వైపు వెళ్లే భారీ వాహనాలను నాయనపల్లి క్రాస్ నుంచి నేరుగా బుక్కరాయసముద్రం, అనంతపురం, బత్తలపల్లి మీదుగా వెళ్లవచ్చని వివరించారు. కదిరి లేదా ధర్మవరం నుంచి నార్పల మీదుగా తాడిపత్రికి వెళ్లాల్సిన భారీ వాహనాలను బత్తలపల్లి, అనంతపురం, బుక్కరాయసముద్రం, నాయనపల్లి మీదుగా మళ్లించామన్నారు. పులివెందుల, తాడిమర్రి, మాల్యవంతం మీదుగా నాయనపల్లి, తాడిపత్రికి వెళ్లాల్సిన భారీ వాహనాలను మాల్యవంతం నుంచి బత్తలపల్లి, అనంతపురం, బుక్కరాయసముద్రం, నాయనపల్లి మీదుగా మళ్లించామని పేర్కొన్నారు. బుక్కరాయసముద్రం వద్ద డైవర్షన్ పాయింట్ ఏర్పాటు చేశామని తెలిపారు. నార్పల మీదుగా బత్తలపల్లి వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలను వెనక్కు మళ్లించి అనంతపురం మీదుగా బత్తలపల్లి వైపు పంపేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

సీఎం సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్ ఇక్కడే..

- అనంతపురం, బుక్కరాయసముద్రం మీదుగా వచ్చే బస్సులకు, బత్తలపల్లి నుంచి వచ్చే వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక నాయనపల్లి రోడ్డులోని ఆర్టీటీ ఆఫీస్ సమీపాన పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.
- తాడిపత్రి, శింగనమల, నాయనపల్లిల నుంచి వచ్చే వాహనాలు నార్పల జంక్షన్ దాటాక బత్తలపల్లి రోడ్డులోని పార్కింగ్ స్థలంలో నిలపాలి.
- గూగూడు వైపు నుంచి నార్పల మీదుగా వచ్చే వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక బత్తలపల్లి రోడ్డులో పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- వీఐపీ వాహనాలకు నార్పల జంక్షన్ దాటాక బత్తలపల్లి రోడ్డులోని మీటింగ్ స్థలానికి ఎదురుగా ఉన్న పార్కింగ్ కేటాయించారు. ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

మార్ఫింగ్‌తో ప్రజలను మభ్య పెట్టొద్దు

- ప్రధాన పైప్‌లైన్ దెబ్బ తింటే హంగామా చేస్తావా?
- కాలవ తీరుపై విరుచుకుపడ్డ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు రాజకీయ వ్యభిచారి అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం రాయదుర్గంలోని రోడ్లు, భవనాల అతిథిగృహంలో కాపు మీడియాతో మాట్లాడారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తూ ప్రజలను మోసం చేయడమే కాలవ పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో జరిగిన 'జగనన్నే మానమ్మకం' కార్యక్రమ ఫొటోలు తీసుకుని, కణేకల్లు మండలం బ్రహ్మసముద్రంలో మాట్లాడినట్టు ఆడియోకు జతచేసి ఎలా వక్రీకరిస్తారని మండిపడ్డారు. ఇటీవల టీడీపీ నేత పట్టాభి ఫొటోలు కూడా ఇలాగే మార్ఫింగ్ చేసి అడ్డంగా దొరికిన నీచ చరిత్ర పచ్చబ్యాచిది కాదా అని విరుచుకుపడ్డారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. దిగజారుడు విమర్శలు, చెత్త రాజకీయాలు చేయడంలో చంద్రబాబును మించిపోయావంటూ కాలవపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉండే రాయదుర్గం నియోజకవర్గంలో కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే ప్రజలు తిరగబడి తన్నే రోజులు వస్తాయని హెచ్చరించారు. కాలవ శ్రీనివాసులు పేరును లుచ్చా.. లఫంగీ.. లోఫర్ అని పిలిస్తే సరిగ్గా సరిపోతుందన్నారు. సంపాదించుకోవడం కోసమే కాలవ అనంతపురం నుంచి రాయదుర్గానికి వలస వచ్చారన్నారు. కానీ తాను అలా కాదని, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలపై ప్రేమ, అభిమానం ఉంది కాబట్టే ఏడువేల మంది పేదలకు ఉచిత వివాహాలు, వేలాదిమందికి కంటి ఆపరేషన్లు, ట్రైసైకిళ్లు, ఆపదలో ఉన్న వారికి ఆర్థికసాయం, నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా, డిగ్రీ విద్యార్థులు కళాశాల వెళ్లేందుకు బస్సు సౌకర్యం, ఏడాది పాటు విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు, ఉచిత అంబులెన్సులు ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని కాపు వివరించారు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఏనాడైనా ప్రజల కోసం సొంతంగా ఖర్చు చేసి సేవలందించావా అంటూ ప్రశ్నించారు.

నీటి విషయంలోనూ రాజకీయం చేస్తావా?

రాయదుర్గం ప్రజలు స్వచ్ఛమైన నీరు తాగుతున్నారంటే అది దివంగత నేత వైఎస్సార్ చలువేనని విప్ కాపు గుర్తుచేశారు. అలాంటి పెద్ద తాగునీటి పథకంలో ప్రధాన పైప్‌లైన్ దెబ్బతిని ఆరు రోజుల పాటు పట్టణంలో నీటి సమస్య ఉత్పన్నమైందని, ఈ విషయాన్ని కమిషనర్ కూడా మీడియాద్వారా ప్రజలకు సమాచారమందించారని గుర్తు చేశారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీరు సరఫరా చేశామని చెప్పారు. పైపులైను పనుల పునరుద్ధరణ తర్వాత నీరు రంగు మారితే దాన్ని పట్టుకుని హంగామా చేయడం కాలవ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కాలవా.. నీ చీకటి కోణం.. నీ చిల్లరబుద్ధి గురించి తెలిస్తే ప్రజలు ఎంతగా అసహ్యించుకుంటారో ఊహించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

- 17, 18 తేదీల్లో మైనర్ సబ్జెక్టుల పరీక్షలు

రాప్తాడు రూరల్: పదో తరగతి రెగ్యులర్ ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు జిల్లా వ్యాప్తంగా 139 కేంద్రాల్లో సోషల్ పరీక్ష జరిగింది. 30,763 మంది విద్యార్థులకు గాను 30,369 మంది హాజరయ్యారు. తక్కిన 394 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ రెండు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 35 కేంద్రాలను తనిఖీలు చేశారు. సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి పరీక్షలు కూడా ముగిశాయి. పరీక్షలు ప్రారంభమైన తొలిరోజు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన 8 మంది ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్ పరీక్షలు, ఆరుగురు ఓపెన్ పరీక్షల విధుల్లో ఉన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో కూడా మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేకంగా సిట్టింగ్ / ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. మొదటి రోజు మినహా మిగిలిన అన్ని పరీక్షలు ఎలాంటి సంఘటనలూ తలెత్తకుండా ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

17న సంస్కృతం రెండో పేపర్ పరీక్ష

పదో తరగతి రెగ్యులర్ పరీక్షల్లో భాగంగా ఈ నెల 17న సంస్కృతం రెండో పేపర్ పరీక్ష 60 సెంటర్లలో జరుగుతుందని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ఈ పరీక్షకు 4,101 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదే రోజు ఓరియంటల్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్ష, 18న పేపర్–2 పరీక్ష రెండు సెంటర్లలో జరుగుతుందని, ఈ పరీక్షలకు 39 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే 18న 19 సెంటర్లలో ఒకేషనల్ పరీక్ష 1,328 మంది విద్యార్థులకు జరుగుతుందన్నారు.

కిటకిటలాడిన బస్టాండ్

పదో తరగతి ప్రధాన పరీక్షలు ముగియడంతో హాస్టళ్లు, బంధువుల ఇళ్లల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు తమ సొంతూళ్లకు లగేజీలతో బయల్దేరారు. దీంతో శనివారం అనంతపురం ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది. బస్సులు కిక్కిరిశాయి.

30లోగా దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: గిరిజన గురుకుల పాఠశాల గొల్లలదొడ్డి (సేవాఘడ్)లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి ప్రవేశం కోసం బాలురు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నాదొర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 80 సీట్లు ఖాళీ ఉండగా.. అందులో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, ఏజెన్సీ ఎంప్లాయీస్ కోటా విద్యార్థులకు 3 శాతం చొప్పున కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థులు గడువులోపు www.gurukulam.ap.gov.in లేదా https; twreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 7న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 95426 55088, 93462 54720, 63055 67352 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సందడిగా కేరళ 'నూతన' వేడుకలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న విష్ణు దాస్ బృందం

ప్రశాంతి నిలయం: ప్రశాంతినిలయంలో కేరళ నూతన సంవత్సర వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత కేరళ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ సాయిభక్తుల వేదపఠనం, విష్ణు దాస్ బృందం సంగీత కచేరి ఆకట్టుకున్నాయి. అంతకుముందు కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సుమన్ బిల్లా మాట్లాడారు. తన జీవితంలో సత్యసాయి ప్రదర్శించిన మహిమాన్విత ఘట్టాలను వివరించారు. ప్రేమ,సేవ తత్వాలను కలిగి ఉండడం అంటే దేవున్ని సేవించడమేనన్నారు.

న్యాయవాదిపై చీటింగ్ కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నకిలీ బంగారంతో బ్యాంక్ అధికారులను బురిడీ కొట్టించిన న్యాయవాదిపై అనంతపురం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలను అనంతపురం రెండో పట్టణ సీఐ శివరాముడు వెల్లడించారు. జిల్లా కోర్టు ఆవరణలోని యూనియన్ బ్యాంక్‌లో అనంతపురానికి చెందిన న్యాయవాది మోసెస్ ప్రభాకర్‌కు ఖాతా ఉంది. బ్యాంక్‌లో తొమ్మిది వేర్వేరు సందర్భాల్లో బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.26 లక్షలకు పైగా రుణం తీసుకున్నాడు. రుణాలకు సంబంధించిన తొమ్మిది ఖాతాల్లో ఏ ఒక్కదానికి కంతులు కట్టలేదు. పైగా ఆ రుణాలను రెన్యూవల్ కూడా చేయించుకోలేదు. నోటీసులు పంపినా స్పందించక పోవడంతో చివరకు బంగారు నగలను బ్యాంక్ అధికారులు వేలానికి పెట్టారు. ఆ సమయంలో నగలను పరిశీలించిన అప్రైజర్ బంగారు నగలు నకిలీవని నిర్ధారించాడు. దీంతో అవాక్కైన బ్యాంక్ అధికారులు మొత్తం తంతుపై ఆరా తీశారు. న్యాయవాదికి తమ శాఖలోని సిబ్బంది సహకరించినట్లుగా గుర్తించారు. దీంతో జరిగిన మోసంపై శుక్రవారం రాత్రి అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు న్యాయవాది మోసెస్ ప్రభాకర్‌తో పాటు అప్పట్లో అప్రైజర్‌గా పనిచేసిన శంకరరావుపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కల్లూరు శాఖ, కల్లూరు, అనంతపురము జిల్లా

A/C No. 1) 35802760336 (H/L), 2) 36036173192 (Top Up), 3) 35919025559 (Suraksha)

స్వాధీనతా ప్రకటన

చట్టం - రూల్ 8(1) మరియు (2) క్రింద అనుబంధం-IV (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కల్లూరు శాఖ, కల్లూరు, అనంతపురము జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **30-01-2023** తేది గల డిమాండ్ నోటీసు జారీచేసి **రుణగ్రహీత: శ్రీమతి ఎస్. లీలావతి భర్త ఎస్. రామ సుబ్బానాయుడు, డి.నెం.4-15, కదరకుంట గ్రామం, కూడేరు మండలం, అనంతపురము జిల్లా. గ్యారంటార్ : శ్రీ ఎ. వెంకట నాయుడు తండ్రి ఎ. రామానాయుడు, డి.నెం.28-4-802, పాత SBI కాలనీ, అనంతపురము.** వారిని సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత నోటీసులో తెలిపిన రుణ మొత్తం తేది **1) 27-01-2023** నాటికి రూ. **11,81,448/-** (పదకొండు లక్షల ఎనభై ఒక వేల నాలుగు వందల నలభై ఎనిమిది రూపాయలు మాత్రమే), **2) 27-01-2023** నాటికి రూ. **4,69,380/-** (నాలుగు లక్షల అరవై తొమ్మిది వేల మూడు వందల ఎనభై రూపాయలు మాత్రమే), **3) 27-01-2023** నాటికి రూ. **21,047/-** (ఇరవై ఒక వేల నలభై ఏడు రూపాయలు మాత్రమే) లను + వడ్డీ (ఏవైన చెల్లింపులు వున్నచో తీసివేయబడును) **28-01-2023** నుండి అంగీకరించిన రేటు వంతున తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, చార్జీలు, వ్యయాలు మొ॥ వాటితో తిరిగి చెల్లించవలసినదిగా కోరారు.

సదరు మొత్తమును తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **10-04-2023** తేదీన నిర్మయాత్మక స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేయడమైనది.

సదరు ఆస్తితో వ్యవహారం జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను, గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కల్లూరు శాఖ, కల్లూరు, అనంతపురము జిల్లా** వారికి **1) రూ. 11,81,448/-, 2) రూ. 4,69,380/-, 3)21,047/-** + అంగీకరించిన రేటు వంతున తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥ చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

సెక్యూరిటీ కోసం ప్రతిపాదించబడిన ఆస్తి వివరణ :-

అనంతపురము టౌన్ మున్సిపల్ కార్పొరేషన్, అనంతపురము గ్రామములోని ప్రస్తుతం 28 వార్డ్ లోని సర్వే నం. 438/1B1, 438/1A5, ప్లాట్ నం.లు 6 & 7, L.P. నం. 115/94 లో ఎ. 0.11.63 సెంట్లు లేదా 563.19 చ.గ. విస్తీర్ణంలో నిర్మించబడిన శ్రీ హనుమాన్ ప్యాలెస్ 1134 చ.అ. (అన్ని కామన్ ఏరియాలు కలిపి) విస్తీర్ణంతో మూడవ అంతస్తులో రెసిడెన్షియల్ ఫ్లాట్ నం. 302 లోని ప్రతిపాదించబడిన నిర్మాణం కోసం 22.68 చ.గ. లేదా 18.96 చ.మీ అవిభాజ్య వాటా భూమి. సమోదిత సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1864/2013, తేదీ : 18-02-2013, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం.1865/2013, తేది : 18-02-2013 ప్రకారం ఈ ఆస్తి ఎస్. లీలావతి భర్త ఎస్. రామ సుబ్బానాయుడుకు చెందినది.

సరిహద్దులు : తూర్పు : ప్లాట్ నెం. 8, **పశ్చిమం :** ఇంజనీరింగ్ కాలేజ్ రోడ్డు, **ఉత్తరం :** ప్లాట్ నెం.4 - కాంట్రాక్టర్ రామయ్యకు చెందిన ఇల్లు, **దక్షిణం :** 40 అడుగుల వెడల్పు రోడ్డు, **కొలతలు : 1వ బిట్ - తూర్పు-పశ్చిమం :** 41 అడుగులు లేదా 12.49 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం :** 62.9 అడుగులు లేదా 19.13 మీటర్లు, **2వ బిట్ - తూర్పు-పశ్చిమం :** 39 అడుగులు లేదా 11.89 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం :** 64 అడుగులు లేదా 19.51 మీటర్లు.

మూడవ అంతస్తులోని నివాస ఫ్లాట్ నెం.302 కోసం సరిహద్దులు : తూర్పు : 4 అడుగుల వెడల్పు కారిడార్, ఫ్లాట్ నెం.8, **పశ్చిమం :** ఫ్లాట్ నెం.301 కు 5 అడుగుల వెడల్పు కారిడార్, **ఉత్తరం :** ఫ్లాట్ నెం. 4 మరియు కాంట్రాక్టర్ రామయ్యకు చెందిన ఇల్లు, **దక్షిణం :** ఫ్లాట్ నెం.303కు 4'6" వెడల్పు గల కారిడార్. ఈ ఆస్తి అసైన్డ్ కాదు. ఈ ఆస్తి డోర్ నెం. 28/489 సమీపాన కలదు.

తేది : 10-04-2023
ప్రదేశం : కల్లూరు

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కల్లూరు శాఖ, కల్లూరు

'జగనన్నే మా భవిష్యత్తు'కు అపూర్వ ఆదరణ

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: జిల్లాలో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోందని, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తామని ప్రజలు బాహాటంగా చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిని నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే సీఎం వైఎస్ జగన్ జమ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణకు చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో తమ ముంగిటకు వెళ్లిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులను ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారన్నారు. ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్వాసం కనబరుస్తూ స్వచ్ఛందంగా 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారన్నారు.

ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్ మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వం పూర్తి వ్యాపార దృక్పథంతో పాలన సాగించి పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసిందన్నారు. దివంగత నేత వైఎస్సార్ సాగించిన సంక్షేమ పాలనను గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లోనే సీఎం వైఎస్ జగన్ నడుస్తూ.. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఏ మాత్రం వెనుకంజ వేయకుండా సంక్షేమాన్ని, అభివృద్ధిని కొనసాగించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్నందించి చరిత్ర నెలకొల్పారన్నారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుంచి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మొదలైందని, రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయ పరిధిలోని 1.60 లక్షల కుటుంబాల ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ రాష్ట్రంలోని 61 లక్షల కుటుంబాలను గృహసారథులు, కన్వీనర్లు సందర్శించగా.. అందులో 47 లక్షల మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు నిలిచారన్నారు. రాష్ట్రానికి మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలనే బలమైన ఆకాంక్ష ప్రజల నుంచి వ్యక్తమవుతోందన్నారు. సమావేశంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

అనంతపురం సిటీ: జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారి జిల్లా సిరుగుప్పకు చెందిన సెంబు లింగయ్య (67)కు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ముగ్గురికి పెళ్లి చేశారు. పెద్ద కుమార్తె తన భర్తతో కలసి అనంతపురంలోని అరవిందనగర్‌లో నివాసముంటోంది. కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న లింగయ్య అనంతపురం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ఆస్పత్రిలో క్రమం తప్పకుండా వైద్యం చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే వైద్యుడ్ని కలిసేందుకు శుక్రవారం ఉదయం తన భార్యతో కలసి లింగయ్య వచ్చాడు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని, ఆస్పత్రిలో అడ్మిట్ కావాలని డాక్టర్ సూచించారు. దీంతో భార్యను సిరుగుప్పకు పంపి, తాను కుమార్తె ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన... రాంనగర్ రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. అప్పటికే ఆయాసం ఎక్కువై శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతున్న లింగయ్య... అదే సమయంలో అటుగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఈ విషయాన్ని కుమార్తె, అల్లుడు గుర్తించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ విజయ కుమార్ కేసు నమోదు చేశారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, డీ.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ శ్రీ పఠాన్ టోపి ఖాన్ వారు అనంతపురము జిల్లా, యాడికి మండలం, చందన గ్రామం సర్వేనెం.728 నందు 24.493 హెక్టార్ల విస్తీర్ణంలో డోలమైట్ & బెరైటీస్ మైను ఏర్పాటు కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు	శ్రీ పఠాన్ టోపిఖాన్ సర్వేనెం.728, చందన గ్రామం, యాడికి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.728, చందన గ్రామం, యాడికి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం భూమి విస్తీర్ణం 24.493 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ పఠాన్ టోపిఖాన్, డి.నెం.1/123-సి, రాయలచెరువు మెయిన్‌రోడ్డు, రాయలచెరువు గ్రామం, యాడికి మండలం, అనంతపురము జిల్లా, సెల్: 8897765682
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	సుమారు రూ.77.0 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	2,39,999 టిపిఏల డోలమైట్ & 299.99 టిపిఏల బెరైటీస్ మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 19.05.2023 సమయం : ఉ.11.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, చందన గ్రామం, యాడికి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ CEIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము, అనంతపురము జిల్లా
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము జిల్లా
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ.) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, యాడికి మండలం, అనంతపురము జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, చందన గ్రామం, యాడికి మండలం, అనంతపురము జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7III(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అర్థివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

సం/-
పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

ప్రదేశం : అనంతపురము
తేది : 15.04.2023

భూసార పరీక్షలపై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: భూసార పరీక్షలు, తద్వారా సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ ఆదేశించారు. స్థానిక కృషిభవన్‌లో అనంతపురం రూరల్ ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌యాదవ్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం (అగ్రి అడ్వైజరీ బోర్డు)లో మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి మంచి పంట దిగుబడులు వచ్చేలా చేయడమే భూసార పరీక్షల లక్ష్యమన్నారు. ఈ క్రమంలో మట్టి పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రతి రైతు పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక రసాయన విశ్లేషణ చేసి పోషకాలు గుర్తించాలన్నారు. అనంతరం పంటలకు అవసరమైన స్థూల, సూక్ష్మపోషకాల ఎరువులను సిఫారసు చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియ శాస్త్రీయ పద్ధతుల్లో జరుగుతుందన్నారు. త్వరలో భూసార పరీక్షలకు కార్యాచరణ మొదలవుతుందన్నారు. సమావేశం అనంతరం మండలం ఆలమూరు పరిధిలో మట్టి సేకరణపై అగ్రి బోర్డు సభ్యులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరమణ, పశువైద్యులు డాక్టర్ శారద, ఏఈఓలు సుజిత, శిరీష, మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

హోమియోపతిపై నమ్మకం పెంచిన చలపతి

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి
- ఆర్ట్స్ కళాశాలలో 'జీవీ చలపతి మెమోరియల్ ప్రైమరీ హెల్త్ కేర్' సెంటర్ ప్రారంభం



హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

రాప్తాడు రూరల్: జిల్లాలో హోమియోపతి వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచిన ఖ్యాతి దివంగత హోమియో వైద్యుడు జీవీ చలపతికే దక్కుతుందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. డాక్టర్ జీవీ చలపతి జ్ఞాపకార్థం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని' శనివారం వారు ప్రారంభించి, మాట్లాడారు. పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్న చలపతి కుటుంబసభ్యుడు వేణును అభినందించారు. తన సేవల ద్వారా ఇతర రాష్ట్రాల్లోనూ జీవీ చలపతి గుర్తింపు పొందారన్నారు. ఆయన స్ఫూర్తితో ఎంతోమంది హోమియోపతి వైద్యసేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీ దివాకర్‌రెడ్డి, సీడీపీసీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబ్బులడిగితే కఠిన చర్యలు

- కళ్యాణదుర్గం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగుల నుంచి డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి హెచ్చరించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆస్పత్రిలో చికిత్స పొందిన వారితో డబ్బు వసూలు చేస్తుండడంపై 'అత్యాశపై ఉక్కుపాదం' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై డాక్టర్ మాధవి స్పందించారు. గతంలో ఓ ఏఎన్‌ఎం ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కలెక్టర్ నోటీసు ఇచ్చి, విచారణ చేశారని, ఈ సందర్భంగా కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో అక్రమాలు చోటు చేసుకోలేదని తేలిందని గుర్తు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి ఏ ఒక్కరూ ఒక్కపైసా కూడా ఆశించరాదన్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే తనను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ



తీవ్రంగా గాయపడిన దిలీప్

గుత్తి: స్థానిక కాల్వగడ్డ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘటనలో దిలీప్ అనే నాల్గో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. తరగతి గదిలో కూర్చొనే విషయంలో గౌస్, అజయ్ గొడవ పడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న దిలీప్ జోక్యం చేసుకుని వారిని విడిపించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో గౌస్ పలకతో దిలీప్ తలపై మోదడంతో తీవ్ర రక్త గాయమైంది. విషయాన్ని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి, కుట్లు వేయించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం



అబ్దుల్ కరీం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన ఇ.అబ్దుల్ కరీం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. దీంతో విరక్తి చెందిన అబ్దుల్ కరీం కుటుంబసభ్యులకు ఎవరికీ తెలపకుండా శనివారం ఉదయం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. సాయంత్రమైన ఇల్లు చేరకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. కాగా, అబ్దుల్ కరీం ఇల్లు విడిచి వెళ్లే సమయంలో నీలం రంగు జుబ్బా, పైజామా వేసుకున్నాడు. ఆచూకీ తెలిసిన వారు 93469 17115కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయండి



కళ్యాణదుర్గం: జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 17న నార్పలకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఈవీఎంల భద్రతలో జాగ్రత్తలు పాటించండి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



ఈవీఎంల భద్రతను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎన్నికల డీటీ భాస్కర్

అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రత విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. స్థానిక టవర్ క్లాక్ సమీపంలోని పాత ఆర్డీఓ కార్యాలయ గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం ఆమె పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గదులపై నిరంతర నిఘా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. చిన్నపాటి సమస్య వచ్చినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఈవీఎంల భద్రతకు తీసుకున్న జాగ్రత్తలను ఎన్నికల డీటీ భాస్కర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవి పాల్గొన్నారు.

17 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

అనంతపురం: పాలిసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ శిక్షణ ఉంటుంది. పూర్తి వివరాలకు వి.నరసింహారెడ్డి (ఫిజిక్స్ లెక్చరర్- 94905 41633), పి.సుంకన్న (సీనియర్ లెక్చరర్, కెమిస్ట్రీ- 95029 76961)కు సంప్రదించవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి కోరారు.

క్లుప్తంగా

సామూహిక ధర్మోపనయనాలు

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ ఉపనయన సేవా సమితి ఆధ్వర్యంలో శంకర జయంతిని పురస్కరించుకొని సామూహిక ధర్మోపనయనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాయిశ్వరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న జగద్గురు శంకరజయంతి ఉందని, గురు మౌఢ్యమి కారణంగా వచ్చేనెల 3న ఉచితంగా బ్రాహ్మణ ఉపనయనాలు జరిపిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదుకు సెల్: 9440090060, 9441506811లో సంప్రదించాలన్నారు.

ఖర్జూర పండ్లు పంపిణీ



రాప్తాడులో ముస్లింలకు కర్జూర పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రాప్తాడు: మండల వ్యాప్తంగా 9 మసీదుల్లోని ముస్లింలకు ఖర్జూర పండ్లు పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ శనివారం రాత్రి తెలిపారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో 100 మంది ముస్లింకు ఖర్జూర పండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. రంజాన్ మాసం పూర్తయ్యే వరకు పంపిణీ చేస్తామని, ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: పేద ముస్లింల ఇంట రంజాన్‌తోఫాతో నిజమైన పండుగ అని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తెలిపారు. శనివారం స్థానిక పీటీసీ ఎదుట ఉన్న చాందినీ మసీదులో చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. ప్రభుత్వ ఖ్వాజీ మౌలానా హారూన్ రషీద్ ప్రత్యేక దువా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో చేసే ప్రతి కార్యం ఎంతో ఉత్తమమైనదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, మౌలానా హారూన్ రషీద్, చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ మునీర్‌బాషా, మహమ్మద్ రఫీ, కువైట్ ఖాదర్ బాషా, షెక్షావలి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'విషు' పండుగ

అనంతపురం కల్చరల్: మలయాళీల సంవత్సరాదిగా కొలిచే 'విషు' పండుగ వేడుకలు శనివారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. స్థానిక పాతూరులోని చెరువుకట్టపై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో కేరళవాసులు విషు వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోడ్డు శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం,రామనగర్ 80 ఫీట్ రోడ్డు అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం సెమినార్ హాలులో 'సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై శనివారం ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో 9 వర్సిటీలు (జేఎన్‌టీయూ అనంతపురం, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ, బెస్ట్ యూనివర్సిటీ, సత్యసాయి డీమ్డ్, ఐబీటీ డీఎం, డాక్టర్ ఏహెచ్ ఉర్దూ యూనివర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ)తో కూడిన క్లస్టర్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. సైబర్ సెక్యూరిటీ అంశంపై అధ్యాపకులు అందరూ నూతన అంశాలను అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, సదస్సు కన్వీనర్ డాక్టర్ కే మాధవి, కోఆర్డినేటర్ డాక్టర్ ఏపీ శివకుమార్ పాల్గొన్నారు.

దిశసెంటర్‌కు అనంత యువతి

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ఉన్న యువతిని రైల్వే పోలీసులు కాకినాడ దిశ సెంటర్‌కు అప్పగించారు. రైల్వే ఎస్‌ఐ బి.లోవరాజు వివరాల మేరకు.. శనివారం ఉదయం అనంతపురం నుంచి ఓ వ్యక్తి ఫోన్‌చేసి తన చెల్లెలు తళ్లరి సాయికీర్తన రెండు వారాల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిందని, సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంపై ఉన్నట్లు కొందరు ప్రయాణికుల ద్వారా తెలిసినట్లు సమాచారం అందించాడు. వాట్సప్‌లో వచ్చిన ఫొటో మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో ఆ యువతి సాయికీర్తనగా తెలుసుకొని ఆమె తల్లిదండ్రులకు తెలియజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అజరామరం 'అనంత' రంగస్థలం

- నలుదిశలా జిల్లా కళాకారుల స్ఫూర్తి

సందర్భం : - నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం



అనంత వాసులు ప్రదర్శించిన అపురూప సన్నివేశాలు

అనంతపురం కల్చరల్: వినోదాన్ని అందించే సాధనంగా ఆరంభమైన నాటకరంగం తొలిరోజుల్లో విజ్ఞానదాయకంగాను, సందేశాత్మకంగా సాగి, సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసింది. బ్రిటీష్ కాలం నుంచే అనంతలోనూ రంగస్థల ఖ్యాతి దేశ విదేశాల్లోనూ పరిఢవిల్లింది. పౌరాణికమైనా, పద్యనాటకమైనా, చారిత్రాత్మక, సాంఘిక నాటకాలకైనా ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన సుప్రసిద్ధ నటుడు బళ్లారి రాఘవ అనంత వాసి కావడం గర్వకారణం. తాయన నాటక రంగ వేదికపై చేసిన ప్రయోగాలు భారతీయులను ప్రత్యేకంగా ఆకర్షించాయి. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న ఎందరో రంగస్థలాన్ని సుసంపన్నం చేశారు. నాటకానికి విశేష ప్రఖ్యాతి తెచ్చిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగస్థల దినోత్సవంగా జరుపుకుంటారు. కాకతాళీయంగా బళ్లారి రాఘవ వర్ధంతి, ప్రసిద్ధ హాలీవుడ్ హాస్యనటుడు చార్లీచాప్లిన్ జయంతి కూడా ఇదే రోజున కావడంతో ఆదివారం పలు చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

స్వాతంత్య్ర సమరయోధుడు కల్లూరు సుబ్బారావు దాతృత్వంతో స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో ఏర్పాటైన లలితకళాపరిషత్తు ద్వారా ఎంతో మంది నటీనటులు జిల్లా కీర్తిని ఇతర రాష్ట్రాలకు సైతం వ్యాపింపజేశారు. రొద్దం హనుమంతరావు, కేసీ కృష్ణ , రామశేషయ్య, నరసింహామూర్తి, అబ్దుల్ సత్తార్, పాండురంగమూర్తి, విజయలక్ష్మి తదితరులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నాటకాలాడి మెప్పించారు. ఎల్కేపీ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన గాజుల నారాయణస్వామి 'సతీ సావిత్రి' నాటకంతో ఏకంగా ఐదు నంది అవార్డులను జిల్లాకు వచ్చేలా చేశారు. అనంతరం కూడా ఎంతో మంది నటీనటులు నాటక రంగంపై ప్రయోగాలు చేస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూనే ఉన్నారు.

నేడు ఎల్కేపీలో నాటకరంగ దినోత్సవం:

తెలుగు నాటక రంగదినోత్సవం సందర్భంగా ఎలేక్పీలో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు లలిత కళాపరిషత్తు ప్రధాన కార్యదర్శి పద్మజ తెలిపారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగేహరిత సమక్షంలో వేడుకలు నిర్వహించి, పలువురిని సన్మానాలు చేయనున్నట్లు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపక వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఫైరింజిన్ ఉపయోగించి విన్యాసాలు చేశారు. అగ్ని ప్రమాదాలు,గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సప్తగిరి సర్కిల్, తాడిపత్రి బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, టవర్ క్లాక్ దగ్గర అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు చేశారు.

జిల్లావాసికి పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సాయిట్రస్టు విజయ్‌కుమార్‌కు గౌతమబుద్ధ శాంతి పురస్కారాన్ని శనివారం అందించారు. బుద్ధజయంతిని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా డ్రీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో శాంతి పురస్కార సభ నిర్వహించారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కార్యదర్శి బాలగంగాధర తిలక్ అవార్డు అందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



థ్యాంక్యూ సీఎం సార్ అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న లబ్ధిదారులు

అనంతపురం క్రైం: నగరంలోని 44వ డివిజన్ పరిధిలోని 64 సచివాలయంలో 62 మంది ఈబీసీ లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్పొరేటర్ ఎంవీ శాంతిసుధ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో అర్హులందరికీ పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులు థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మధు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్ మార్చండి

అనంతపురం సిటీ: బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీలో విభిన్న ప్రతిభావంతుల రోస్టర్ పాయింట్‌ను 56 నుంచి 10కి మార్చాలని విభిన్న ప్రతిభావంతుల జిల్లా సంఘం అధ్యక్షుడు సాకే ఆంజనేయులు అధికారులను కోరారు. శనివారం నగరంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, అనంత దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. గత నెలలో బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీకి విడుదలైన నోటిఫికేషన్‌లో మూడు పోస్టులు మాత్రమే రిజర్వ్ చేశారన్నారు. సోమవారం నార్పలలో జరగనున్న భారీ బహిరంగ సభకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థి విభాగం ప్రతినిధి మహంతేశ్, కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, కోశాధికారి ఎర్రిస్వామి ,రామాంజనేయులు మాట్లాడారు.

రాష్ట్ర శాప్ ఎండీకి స్వాగతం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) మేనేజింగ్ డైరెక్టర్ కత్తి హర్షవర్ధన్ శనివారం రాత్రి అనంతకు చేరుకున్నారు. సోమవారం ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఆయన జిల్లాకు చేరుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన శాప్ డైరెక్టర్ ఓబిరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి, బత్తుల కోదండరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, స్వాగతం పలికారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తామని కమిషనర్ రమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇటీవల నగరపాలక సంస్థలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యంగా తాను, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ రావు, పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. అందులో భాగంగా 10 టన్నుల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేశామన్నారు. నిబంధనల మేరకే సదరు వ్యాపారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలోనే ప్లాస్టిక్ వ్యాపారులను గట్టిగా హెచ్చరించినా, వారిలో ఎలాంటి మార్పులేదన్నారు. దాడులను విస్తృతం చేసి, ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తామన్నారు. నగర ప్రజలు సైతం ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

- నగర పాలక సంస్థ మేయర్ వసీం



సీఐ జాకీర్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేస్తున్న నగర మేయర్ వసీం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరపాలక సంస్థ ఉద్యోగులపై బీజేపీ నాయకులు అనుచితంగా ప్రవర్తించడం సరికాదని మేయర్ వసీం అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నాల్గో పట్టణ సీఐ జాకీర్‌హుసేన్‌కు ఫిర్యాదు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఉద్యోగుల పట్ల బీజేపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉద్యోగులకు నగర మేయర్ సంఘీభావం ప్రకటించారు. ప్రజా సంక్షేమం, నగర అభివృద్ధి కోసం అధికారులు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యం చేస్తుంటే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలన్నారు. అంతేగానీ అధికారులపై అజమాయిషీ చేస్తే సహించేది లేదన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగడం వారిని అవమానపరిచినట్లవుతుందన్నారు. ఉద్యోగులతో కలిసి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలపై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. డీఎస్పీ కార్యాలయానికి మేయర్, ఉద్యోగులు, కార్పొరేటర్లు, నాయకులు వచ్చారు.

వ్యక్తిగత దూషణలు సరికావు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులపై బీజేపీ నాయకులు వ్యక్తిగత దూషణలు సరికావని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. శనివారం ఆమె ఓ ప్రకటనలో బీజేపీ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యంగా అధికారులు దాడులు నిర్వహించారని తెలిపారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి కానీ, ఇలా ప్రవర్తించడం సరికాదని అన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపు

అనంతపురం క్రైం: జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న నార్పలో జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా తీసుకెళ్తున్నారని, ఈ నెల 20తేదీలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంట్లో 15 నుంచి 20 నిమిషాల పాటు ఉండి, ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, చింతా సోమశేఖర్ రెడ్డి, కృష్ణవేణి, కార్పొరేటర్లు గూడూరు మల్లికార్జున టీవీ చంద్రమోహన్ రెడ్డి, సాకే చంద్ర, సాకే చంద్రలేఖ, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు పెన్నో బులేసు, సాకే కుళ్లాయస్వామి, రామయ్య, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

ఆరోరోడ్డులో ఇఫ్తార్ విందు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఆరో రోడ్డులో ఉన్న మసీద్ ఏ హాజీరాలో కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర మేయర్ వసీం సలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జాయింట్ సెక్రటరి ఖాజా, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, బాబాఫక్రుద్దీన్, మునిశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, ఏ1 రఫి, గఫార్, కువైట్ ఖాదర్‌బాషా, మసూద్, ఖాదర్, షెక్షా, గఫార్, బాషా భై, బబ్లూ, నరేష్ పాల్గొన్నారు.

ఫక్కీరప్ప సేవలు మరువలేనివి

- నూతన డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి



మాట్లాడుతున్న నూతన డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఎస్పీగా ఫక్కీరప్ప సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. ఇటీవలే సీఐడీ విభాగానికి బదిలీ అయిన ఫక్కీరప్పకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి స్థానిక పోలీసు కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి, నూతన ఎస్పీ కంచి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఫక్కీరప్పను ఘనంగా సన్మానించి జిల్లా ఎస్పీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కంటైనర్ ప్రమాదంలో రూ.35 లక్షలు నష్టం



కంటైనర్‌లో మంటలు ఆర్పుతున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర శివారుల్లోని 44వ జాతీయ రహదారిపై జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.35 లక్షలు నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. శుక్రవారం రాత్రి జాతీయ రహదారిపై మేఘనా హోటల్ వద్ద కంటైనర్‌లో మంటలు చెలరేగిన విషయం విదితమే. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటైనర్‌లో విద్యుత్ పరికరాల వ్యర్థాలను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కంటైనర్ ఎవరిదన్నది తెలియరాలేదన్నారు. మంటలను ఆర్పి ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. వాహనదారుల వద్ద సరుకుకు సంబంధించి ఎలాంటి బిల్లులు,పత్రాలు లేవని అన్నారు. దాదాపు రూ.35 లక్షలు నష్టం జరిగినట్లు ఆయన తెలిపారు. బాడుగలకు ఆశపడి వాహన దారులు కూడా ఇలాంటి సరుకును రవాణా చేయొద్దని సూచించారు. నిబంధనల మేరకు వాహనాలను నడిపితే కనీసం బీమా లాంటివి వర్తిస్తాయన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి



పాదయాత్ర చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని వామపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సెంట్రల్ యూనివర్సిటీలో వామ పక్ష పార్టీ నేతలు పర్యటించారు. అనంతరం జంతలూరు నుంచి అనంతపురం వరకు పాదయాత్ర నిర్వహించారు. వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేరుకు మాత్రమే సెంట్రల్ యూనివర్సిటీ ప్రకటించిందన్నారు. నిధులు మంజూరు చేయయంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 2015లో సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. రాయలసీమ విభజన చట్టంలో అనేక హామీలు ఇచ్చారని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు, జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి, సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రమణయ్య, లింగమయ్య, మల్లికార్జున మద్రిస్వామి, తిరుపతయ్య, వెంకట్ పాల్గొన్నారు.

• గొంతు ఎండ 'కుండ'..సేవ

ఏప్రిల్ నెలలో ఎండలు మండుతున్నాయి. ఎండవేడిమి తాళలేక పక్షులు నోర్లెళ్లబెడుతున్నాయి. నీరు, నీడ, ఆహారం అత్యవసరం. వేసవి పూర్తయ్యే వరకు చెట్టునీడన సేదతీరేందుకు పక్షులు తహతహలాడుతాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పక్షుల 'గొంతెండ కుండా సేవ' చేద్దామని నిర్ణయించారు. నీరు, నీడ, ఆహారం అందించాలని వినూత్నంగా ఆలోచించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కుండలు ఏర్పాటు చేశారు. పక్షుల కోసం చెట్లపై కుండలు వేలాడదీసి, ధాన్యపు కంకులతో పాటు నీరు అందిస్తున్నారు. వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రెక్టార్ ఆచార్య మల్లికార్జున రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య మురళీధర్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి పూర్తయ్యే వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పర్యవేక్షణలో కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు. - అనంతపురం



'చెట్టుకు కుండ'.. కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి, తదితరులు



అభాగ్యురాలికి 'అమ్మ' ఆసరా



సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: రాప్తాడు మండలం పేద బ్రాహ్మణపల్లికి చెందిన కారు డ్రైవర్ రవీంద్ర కుటుంబానికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ తరిమెల రమణారెడ్డి ఆపన్న హస్తం అందించారు. రవీంద్రకు భార్య సాయిలీలతో పాటు, ప్రదీప్, మోక్షిత ఇద్దరు సంతానం. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కూతురు పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో వైద్యానికి ఖర్చయ్యేది. ఇలాంటి సందర్భంగా రవీంద్ర ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్పైనల్‌కార్డు, కాలు పోగొట్టుకున్నాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.లక్షలు వెచ్చించినా ఫలితం లేకపోయింది. దీనికితోడు పేదరికం కావడం మరింత కుంగదీసింది. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తుండగా అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి స్పందించి శనివారం బాధిత కుటుంబానికి రూ.10వేలు విలువజేసే వీల్‌చైర్, రూ.30వేలు వెచ్చించి నిత్యావసర వస్తువులు, మరో రూ.10వేలు నగదు అందించారు.

బీజేపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలి



ఆందోళన చేస్తున్న ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరపాలక సంస్థ అధికారులపై దౌర్జన్యం చేసిన బీజేపీ నాయకులను అరెస్ట్ చేయాలని సీపీఎం, మున్సిపల్ కార్మిక, కుల సంఘాల జేఏసీ, ఏపీ ఎన్‌జీఓ ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం సీపీఎం నగర కార్యదర్శి నాగేంద్ర, ఏపీ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు మద్రిరెడ్డి మనోహరరెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, శ్రీధర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మున్సిపల్ అధికారులు, పోలీసుల సహాయంతో నగరంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే షాపులపై దాడి చేసి జరిమానాలు విధించారన్నారు. బీజేపీ నాయకులు తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై దాడి చేయాలని చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులను దూషించిన వారిపై చర్యలు తీసుకోకపోతే అనంత బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నేతలు వెంకటనారయణ, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నేతలు ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి, సావిత్ర, నాగరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

కారు ఢీ - వ్యక్తికి తీవ్ర గాయాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక తపోవనం కూడలిలో బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన నారాయణస్వామిని శనివారం ఉదయం కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బీఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన బీఫార్మసీ రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే

రాప్తాడురూరల్: అనంతపురం రామ్‌నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే సందడిగా సాగింది. పాఠశాల చైర్మన్ దాదాగాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మాజీమంత్రి శైలజానాథ్, సామాజిక కార్యకర్త కేవీ రమణ హాజరయ్యారు. చిన్నారులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం శైలజనాథ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ తర్వాత ఇంకా ముందు తరగతికి వెళ్లి బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని చిన్నారులకు సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళకు అత్యాధునిక శస్త్రచికిత్స

అనంతపురం సప్తగిరి సర్కిల్: మూత్రవిసర్జన (స్ట్రెస్ యూరినరీ ఇన్‌కాంటినెన్స్) సమస్యతో బాధపడుతున్న 40 ఏళ్ల మహిళకు కిమ్స్ సవీరా వైద్యులు శనివారం అత్యాధునిక శస్త్రచికిత్స చేశారు. మెట్రో నగరాల్లో చేసే ఇలాంటి శస్త్ర చికిత్సను రాయలసీమలోనే తొలిసారిగా అనంతలో చేసినట్లు వైద్యుడు నరేంద్రనాథ్ తెలిపారు. బాధపడుతోందన్నారు. ఆమెకు 15 ఏళ్ల క్రితం గర్భసంచి తొలగించారని, నాలుగేళ్లుగా ఎస్‌యూఐ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం ఆమె మూత్రవిసర్జన సమస్య నుంచి ఉపశమనం పొందడంతో శనివారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.